క్లుప్తంగా

నేడు కొల్లాపూర్‌లో డయల్ యువర్ డీఎం

కొల్లాపూర్: ఆర్టీసీ బస్ డిపో పరిధిలో రవాణా పరమైన సమస్యలు, సలహాలు తెలుసుకునేందుకు శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శుక్రవారం డీఎం ఉమా శంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు సెల్: 90004 05878 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

పాఠశాలకు సామగ్రి అందజేత



కల్వకుర్తిరూరల్: మండలంలోని తర్నికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.1,50,000 ల విలువ చేసే స్పోర్ట్స్, సైన్స్ విభాగాలకు సంబంధించిన సామగ్రిని శుక్రవారం మాజీ సర్పంచ్ పవన్‌కుమార్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు దాతను సన్మానించారు. హెచ్‌ఎం ధర్మేందర్‌రావు, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, హరిత, బాల్‌రాజు, బాలసాయిలు, జంగయ్య, ప్రశాంత్, రంజిత్ రెడ్డి, యాసూఫ్, మహేష్ పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

పెంట్లవెల్లి: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రామన్ గౌడ్ హెచ్చరించారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు సక్రమంగా ఉంచుకోవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగొద్దన్నారు. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



కల్వకుర్తిరూరల్: మండలంలోని రఘుపతిపేటలో కృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రథంపై శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగించారు. మహిళలు కోలాటాలు ఆడారు. గ్రామస్తులు ఊరేగింపునకు మంగళహారతులు పట్టారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

సైబర్‌నేరాలపై అవగాహన



తాడూరు: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏఎస్‌ఐ స్వామి ఆధ్వర్యంలో శుక్రవారం సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. కొత్త వ్యక్తులు ఫోన్ చేస్తే వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు చెప్పొద్దన్నారు. సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులతో పరిచయం చేసుకోవద్దన్నారు. పోలీస్‌సిబ్బంది, ప్రజలు ఉన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలోని మోడల్ హైస్కూల్ శుక్రవారం సైబర్‌నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కొత్త వ్యక్తులకు ఫోన్‌చేసి బ్యాంక్‌ఖాతా, ఆధార్ నంబర్, తదితర వివరాలు చెప్పొద్దన్నారు. అనుమానాస్పదంగా ఎవరైన వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

ఎస్‌ఐకి సన్మానం

చారకొండ: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన వెంకట్ రెడ్డిని శుక్రవారం నాగర్‌కర్నూల్ డీసీసీ ఉపాధ్యక్షుడు వెంకటయ్య యాదవ్, జూపల్లికి చెందిన నాయకులు, యువకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. మండలంలోని శాంతి భద్రతలకు సహకరించాలని ఎస్‌ఐ కోరారు. కార్యక్రమంలో నాయకులు లింగయ్య గౌడ్, జంగయ్య యాదవ్, సత్యం యాదవ్, శ్రీనివాస్ గౌడ్, రాజు యాదవ్, శ్రీకాంత్, తిరుపతి తదితరులు ఉన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని శివాజీ చౌక్‌లోని ఓ దుకాణంలో పీడీఎస్ బియ్యాన్ని ఎస్‌ఐ–2 రాంచందర్‌జీ శుక్రవారం పట్టుకున్నారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలో పీడీఎస్ బియ్యం ఉన్నట్లు అందుకున్న సమాచారం మేరకు సివిల్ సప్లయ్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాఘవేందర్ రెడ్డితో కలిసి దాడులు నిర్వహించారు. శివాజీ చౌక్ వద్ద ఉన్న అజాస్ దుకాణంలో 4.6 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

వైభవంగా బోనాలు



పెద్దాపూర్‌లో బోనాల ఊరేగింపులో పాల్గొన్న నాయకులు



తిమ్మాయిపల్లిలో బోనాలతో వస్తున్న మహిళలు

చారకొండ: మండలంలోని తిమ్మాయిపల్లిలో శుక్రవారం ముత్యాలమ్మ బోనాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. డప్పు చప్పుళ్ల మధ్య మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. అంతకుముందు కోటమైసమ్మ, బొడ్రాయి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. మహిళలు పూనకాలు ఊగారు. పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. గ్రామంలో స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు, యువకులు, మహిళలు గ్రామస్తులు ఉన్నారు.

పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్‌లో భక్తిశ్రద్ధలతో పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు నిర్వహించారు. దేవాలయంలో అమ్మవారికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య శాస్త్రోక్తంగా విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. సాయంత్రం అమ్మవారికి ప్రత్యేకంగా చేసిన బోనాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి పూజలు చేసి నైవేద్యాలను సమర్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థులు వాషింగ్ మిషన్ వితరణ



లింగాల: స్థానిక గిరిజన బాలికల మినీ గురుకులానికి 1988– 89 విద్యా సంవత్సరం పూర్వ విద్యార్థులు వాషింగ్ మిషన్‌ను వితరణ చేశారు. శుక్రవారం పూర్వ విద్యార్థులు మహేష్, హన్మంత్, వెంకటస్వామి, సుజాత వాషింగ్ మిషన్‌ను కొనుగోలు చేసి అందజేశారు. దాతలను హెచ్‌ఎం భాగ్యలక్ష్మి అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో మగ్దూంపూర్ మాజీ ఉప సర్పంచ్ సుధాకర్ గౌడ్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

డీఐఈఓకు వినతి



నాగర్‌కర్నూల్‌రూరల్: అతిథి అధ్యాపకులను రెన్యూవల్ చేయడం శుభపరిణామమని వెంటనే అవసరమైన కళాశాలలో నియమించాలని ఆ సంఘం అధ్యక్షుడు కావలి కృష్ణ కోరుతూ శుక్రవారం ఇంటర్ విద్యాధికారి వెంకటరమణకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం జిల్లాలోని కొన్ని సబ్జెక్ట్‌లకు సంబంధించిన పోస్టులు కనిపించడం లేదని వాటిని సరి చేసి అనుమతించాలని కోరారు. మరోచోట ప్రభుత్వ కళాశాలల్లో స్థానం కల్పించాలని విన్నవించారు. కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, పాండు, గఫర్, కృష్ణ, గోపాల్, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తొట్టెల ఊరేగింపు

వెల్దండ: మండల కేంద్రంలో బోనాల సందర్భంగా శుక్రవారం తొట్టెల ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన తొట్టెలతో ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పోతురాజుల విన్యాసాలు అలరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్, నాయకులు ఎర్రశ్రీను ముదిరాజ్, జంగయ్యయాదవ్, శేఖర్‌రెడ్డి, యాదగిరి, శ్రీశైలం, మధన్‌గౌడ్, రాజశేఖర్, యువజన సంఘాల నాయకులు, తదితరులు ఉన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని రాస్తారోకో

వీపనగండ్ల: తమ గ్రామాలకు బస్సు వసతిని కల్పించాలని కోరుతూ శుక్రవారం గోవర్ధనగిరిలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. కరోనా సమయంలో గోవర్ధనగిరి, గోపల్‌దిన్నె గ్రామాల మీదుగా మండల కేంద్రానికి వెళ్లే ఆర్టీసీ బస్సులను అధికారులు రద్దు చేసి నేటికీ పునరుద్ధరించలేదని సీపీఎం మండల నాయకులు మహెబూబ్ పాష, నిరంజన్, ఖాజాఉస్సేన్ అన్నారు. బస్సు వసతి కల్పించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని, కొల్లాపూర్, వనపర్తి డిపో అధికారుల నిర్లక్ష్యం వల్ల మండల కేంద్రానికి వెళ్లాలంటే 8 కిలోమీటర్లు నడవాల్సి వస్తుందని వాపోయారు. రాస్తారోకో కార్యక్రమంతో దాదాపు రెండు గంటల పాటు బస్సులు, ప్రైవేట్ వాహనాలు నిలిచిపోయాయి. కార్యక్రమంలో రవిప్రసాద్, కిరణ్, శ్రీనివాసులు, వెంకట్‌స్వామి, కృష్ణయ్య, అహ్మద్ పాల్గొన్నారు.

అర్హత ఉన్న రైతులందరికీ మాఫీ

నాగర్‌కర్నూల్(బిజినేపల్లి): అర్హులందరికీ రుణమాఫీ చేస్తామని ఎటువంటి అపోహలు వద్దని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి కోరారు. శుక్రవారం తిమ్మాజీపేట మండలంలోని ఇప్పలపల్లి రైతువేదికలో రుణమాఫీపై మండల వ్యవసాయాధికారి కమల్‌కుమార్, ఏఈఓలు దారెడ్డి విజయ్‌కుమార్‌రెడ్డిలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు ఆందోళన చెందకుండా రుణమాఫీపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి రైతుకు న్యాయం చేస్తామన్నారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. క్లస్టర్‌లోని ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

తెలకపల్లి: మండలంలోని జమిస్తాపూర్ గేటు సమీపంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకోగా అదే సమయంలో ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి వెళ్తున్నాడు. వాహనం దిగి గాయపడిన వ్యక్తి పరామర్శించి 108 ఫోన్ చేసి సమాచారం ఇచ్చి అంబులెన్స్‌కు నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులతో మాట్లాడి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

గూగుల్ మ్యాప్స్ అప్‌డేట్ పేరిట వసూలు

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలో గూగుల్ మ్యాప్స్ అప్‌డేట్ పేరిట ఓ ప్రైవేటు సంస్థకు చెందిన ఇద్దరు యువతులు నగదు వసూళ్లకు పాల్పడుతూ శుక్రవారం గ్రామస్తులకు పట్టుబడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం ఇద్దరు యువతులు జిల్లా కేంద్రంలో పలు వ్యాపార సంస్థల వద్దకు వెళ్లి గూగూల్ మ్యాప్స్ నుంచి వచ్చామని గూగూల్ మ్యాప్స్‌లో దుకాణాల వివరాలు అప్‌డేట్, ఫోటోస్ అప్‌లోడ్ చేస్తామని ప్రచారం చేస్తూ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఓ ఐస్‌క్రీం పార్లర్ యజమానికి యువతులపై అనుమానం రావడంతో డయల్ 100కు సమాచారం ఇచ్చాడు. దీంతో యువతులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి వివరాలు సేకరించారు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. ఎస్‌ఐ గోవర్ధన్ వివరణ కోరగా ఓ కంపెనీ తరపున యువతులు ప్రకటన కోసం వచ్చారని తెలిపారు.

కంటి వైద్య శిబిరం



దోమలపెంట: రాములమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామంలో నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో 260 పరీక్షలు చేసుకున్నారు. అవసరమైన వారికి మందులు, కంటి అద్దాలు అందజేశారు. 40 మందికి కంటి ఆపరేషన్లు అవసరం కాగా తొలి విడతలో 10 మందిని హైదరాబాద్‌లోని మెడివిజన్ ఐ కేర్ సెంటర్‌కు తరలించారు. డా.దీప్‌సింగ్, ఫౌండేషన్ నిర్వాహకుడు కటకం వెంకటేష్, సీఐటీయూ రాష్ట్ర నాయకుడు కిషన్, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: మండలంలోని మల్లేశ్వరం యూపీఎస్ పాఠశాలలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డాక్టర్ వినోద్ కుమార్ పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. హెచ్‌ఎం విజయేందర్‌సింగ్, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్మవారికి ఒడిబియ్యం

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శ్రావణమాసం చివరి శుక్రవారం కావడంతో మహిళలు, భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం పోశారు. అధికసంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ చైర్మన్ జూలూరు రమేష్‌బాబు, తదితరులు ఉన్నారు.

ఇంటింటా డ్రైడే



తాడూరు: మండలంలోని చర్ల ఇటిక్యాలలో శుక్రవారం డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై వైద్యసిబ్బంది అవగాహన కల్పించారు. నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. తొట్టిలు, పాత డ్రమ్ములతో నిల్వఉన్న నీటిని పారబోశారు. మాజీ సర్పంచ్ శ్రీదేవి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, అంగన్‌వాడీ, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తప్పొప్పులను సరిచేయాలి



వెల్దండ: ఓటరు జాబితాలో తప్పొప్పులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీఓ లక్ష్మణ్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో కార్యదర్శులు ఓటరు జాబితా సవరణను చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీఓ లక్ష్మణ్ గ్రామాల వారికి ఓటరు జాబితా వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని 32 గ్రామ పంచాయతీల్లో 270 వార్డులు ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

బంగారు బొట్టు వితరణ



నాగర్‌కర్నూల్‌రూరల్: శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా స్థానికంగా ఉన్న సంతోషి మాత దేవాలయంలో చేపట్టిన వరలక్ష్మి వ్రతాల్లో మక్తల్ ఎమ్మెల్యే వాటికి శ్రీహరి సతీమణి లలిత పాల్గొని పూజలు నిర్వహించారు. సంతోషి మాత దేవాలయం, జ్ఞాన సరస్వతి దేవాలయం, రామాలయంలో నిర్వహించిన వరలక్ష్మి వ్రతాల్లో ఆమె పాల్గొన్నారు. సంతోషిమాత అమ్మవారి కోసం 5 గ్రాముల బంగారు బొట్టు, 50 గ్రాముల వెండి గిన్నెలను ఆలయ పూజారి అల్లాడి ప్రకాశ్‌శర్మకు అందజేశారు. నవీన్‌కుమార్, ఎలిమె ఈశ్వరయ్య, భాగ్యమ్మ, రాజేశ్వరి, నందకిషోర్, హిందుమతి, మల్లేష్, రవీందర్, జ్యోతి, రాములు, రమాదేవి, శారద, మహిళా భక్తులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

వెల్దండ: మండల కేంద్రంలోని ఆయా కాలనీలో దోమల నివారణకు శుక్రవారం గ్రామ పంచాయతీ సిబ్బంది ఫాగింగ్ చేశారు. గ్రామంలో సీజనల్ వ్యాధులు సోకకుండా ముందుజాగ్రత్తగా మందులను పిచికారీ చేస్తున్నట్లు కార్యదర్శి గిరి పేర్కొన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సిబ్బంది తదితరులు ఉన్నారు.

రోడ్డును ఆక్రమించారని ఆందోళన



ఆందోళనకారులను శాంతింపజేస్తున్న పోలీసులు

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్ ఎస్సీ కాలనీకి చెందిన పోలే నీలమ్మ, పోలే ఎల్లయ్యలకు సంబంధించిన ఇంటి స్థలంలో రోడ్డు వేస్తున్నారని తెలిసి అప్రమత్తమై రాళ్ల కడీలతో వారు కంచె ఏర్పాటు చేశారు. సీసీరోడ్డు వేసేందుకు కూడా స్థలం వదలకుండా పూర్తిగా ఫిన్సింగ్ చేశారు. దీంతో కాలనీ వాసుల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. రోడ్డు స్థలాన్ని ఆక్రమించారని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. దీంతో శుక్రవారం గ్రామంలో ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఆందోళనకారులను శాంతింపజేసేందుకు యత్నించారు. వారు ససేమీర అనడంతో రోడ్డుపై అడ్డుగా ఉన్న కంచెను తొలగించడంతో ఆందోళన విరమించారు. ఏఎస్‌ఐ కుమారస్వామి, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

2న కలెక్టరేట్ ముట్టడి



నాగర్‌కర్నూల్‌రూరల్: నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా సెప్టెంబర్ 2వ తేదీన సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టనున్న కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బాల్‌నర్సింహ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా నలుమూలల అధికసంఖ్యలో కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

బల్మూర్: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 2న చలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చింత శివకుమార్ అన్నారు. మండలంలోని కొండనాగుల బీసీ బాలుర వసతి గృహాన్ని శుక్రవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో సందర్శించి విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. బీసీ బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరుకుందన్నారు. పైకప్పు పెచ్చులు ఊడిపడుతుండటంతో విద్యార్థులు భయాందోళన మధ్య కాలం వెళ్లదీస్తున్నారని వాపోయారు. ప్రభుత్వం స్పందించి వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించే వరకు కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, నవీన్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం



చెక్కు అందజేస్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాలో పనిచేస్తున్న పోలీసు సిబ్బంది కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఈగలపెంట పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ శ్రీనునాయక్ కుటుంబానికి శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీఐ కార్యాలయంలో కో ఆపరేటివ్ సొసైటీ సంబంధించిన రూ. 30 వేల చెక్కును అందజేశారు. బాధిత కుటుంబానికి పోలీసుశాఖ నుంచి రావాల్సిన అన్ని బెనిఫిట్స్ త్వరగా అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

జూపల్లిలో కుటుంబ నిర్ధారణ సర్వే



చారకొండ: రైతు రుణమాఫీలో కుటుంబ నిర్ధారణకు లేక అనర్హులుగా ఉన్న రైతులు సంబంధిత పత్రాలు అందించాలని ఏఓ తనూజరాజ్ అన్నారు. శుక్రవారం మండలంలోని జూపల్లిలో రైతు వేదికలో కుటుంబ నిర్ధారణ సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రుణమాఫీ జాబితాలో పేరు ఉండి రేషన్‌కార్డు లేని వారి కుటుంబసభ్యుల వివరాలు సేకరిస్తున్నామన్నారు. మండలంలోని 822 మంది రేషన్‌కార్డు లేక రుణమాఫీకి అనర్హులుగా ఉన్నారని తెలిపారు. ఇప్పటి వరకు 370 మంది రైతులకు కుటుంబ నిర్ధారణ సర్వే పూర్తయ్యిందని పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రం, గోకారం రైతువేదికల్లో సర్వే చేస్తునట్లు తెలిపారు. ఏఈఓలు సుష్మ, వంశీ, మహేశ్వరి, సంతోషి, అనూష, రైతులు తదితరులు ఉన్నారు.

బ్యాంకు ఎదుట రైతుల ఆందోళన



కల్వకుర్తిరూరల్: రుణమాఫీ మంజూరు కోసం రూ.2 లక్షలు పైగా ఉన్న బకాయిలను చెల్లించేందుకు శుక్రవారం రైతులు పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంక్ వద్దకు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఉదయం 9 గంటల నుంచే క్యూలైన్లో నిల్చున్నారు. మధ్యాహ్నం 2 గంటల తర్వాత బకాయిలు మొత్తం చెల్లించాలని బ్యాంక్ అధికారులు పేర్కొనడంతో దురుసుగా సమాధానం చెప్పారు. దీంతో కొద్దిసేపు రైతులకు, అధికారుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం బ్యాంక్ ఎదుట రైతులు నిరసన తెలిపారు. రూ. 2 లక్షలకు పైగా ఉన్న డబ్బులు చెల్లించేందుకు వస్తే అధికారులు తీసుకోకుండా మొత్తం బకాయి చెల్లించాలని చెప్తున్నారని వాపోయారు. అర్హులైన రైతులకు న్యాయం చేయాలని కోరారు.

పశువైద్యాధికారిని నియమించాలి

ఉప్పునుంతల: మండల కేంద్రంలో ఉన్న పశువైద్యశాలకు రెగ్యులర్ పశువైద్యాధికారిని నియమించాలని యాదవ సంఘం మండల నాయకులు గున్నమోని బాల్‌నారి యాదవ్ శుక్రవారం ప్రకటనలో కోరారు. ఇక్కడ పనిచేసిన పశువైద్యాధికారి నరేందర్ హైదరాబాద్‌కు బదిలీకావడంలో ఆయన స్థానంలో డాక్టర్‌ను నియమించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధు లు, ఉన్నతాధికారులు స్పందించి డాక్టర్ నియామకానికి చొరవ తీసుకోవాలని కోరారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



పెద్దకొత్తపల్లి: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాసులు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ క్రీడలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో శారీరక ధృడత్వం పెంపొందుతుందన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ చంద్రయ్య, ఎల్లయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సామూహిక వన భోజనాలు

ఉప్పునుంతల: మండల కేంద్రంలోని గ్రామస్తులు శుక్రవారం సామూహిక వన బోజనాలు నిర్వహించారు. ఈదమ్మ గుడి సమీపంలోని కట్టబండ, పెద్దబావి పరిసర ప్రాంతంలోని చెట్లకింద వంటలు చేసుకొని కుటుంబసభ్యులతో సహపంక్తి భోజనాలు చేశారు. అంతకుముందు ఆలయం చుట్టూ ట్రాక్టర్లు, వాహనాలతో ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం



మాట్లాడుతున్న జూలూరు గీతారాణి

కల్వకుర్తిరూరల్: భారతీయ జనతా పార్టీ బలోపేతానికి కృషి చేద్దామని బీజేపీ జిల్లా మహిళా నాయకురాలు జూలూరు గీతారాణి కోరారు. శుక్రవారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు సురేందర్‌గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదామన్నారు. కార్యక్రమంలో కృష్ణాగౌడ్, నర్సిరెడ్డి, బండెల రాంచంద్రారెడ్డి, కిష్టారెడ్డి, వెంకటయ్య, సాయిలు, శ్రీనివాస్‌రెడ్డి, బాలగౌడ్, యాదయ్య పలువురు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతాలు



వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో వ్రతాలు ఆచరిస్తున్న మహిళలు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలు సామూహిక వరలక్ష్మి వ్రతాలు చేపట్టారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు నిర్వహించిన ప్రత్యేక పూజలు చేశారు. పురోహితుడు కాకునూరి ప్రవీణ్‌కుమార్ శర్మ, సువర్ణ, రాధిక, అరుణ, పద్మ, సంధ్య, హైమావతి, శ్రీదేవి, కవిత, సాయిలీల తదితరులు పాల్గొన్నారు.